# మెడికల్ కాలేజీలపై రివ్యూ

- **డీఎంఈలతో సమీక్షించిన వైద్యశాఖ మంత్రి**
- **కాలేజీల్లో వసతులపై ఆరా.. ఏర్పాట్లపై చర్చ**

**నమస్తే ఎఫెక్ట్**

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో పరిస్థితులపై వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం, ఎన్ఎంసీ తనిఖీల నాటికి సిద్ధమయ్యే పరిస్థితులు లేకపోవడంపై నమస్తే తెలంగాణ గురువారం 'మెడికల్ కాలేజీలకు గుర్తింపు గండం' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీంతో ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి కార్యాలయం సూచన మేరకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం మెడికల్ కాలేజీలపై సమీక్ష నిర్వహించారు. హెల్త్ సెక్రటరీ, ఇద్దరు డీఎంఈలను పిలిపించుకొని కాలేజీల్లో పరిస్థితులపై ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నాయి? ఏయే కాలేజీలకు ఎన్ఎంసీ నుంచి నోటీసులు వచ్చాయి? వాటికి ఎలాంటి రిప్లై ఇచ్చారు? ఎన్ఎంసీ తనిఖీలు ఎప్పుడు మొదలవుతాయి?, ఎలాంటి వసతులు కల్పించాలి? వంటి వివరాలపై చర్చించారు. ప్రస్తుత పరిస్తితులు ఇలాగే కొనసాగితే ఈ దఫా 20-30 శాతం మెడికల్ సీట్లలో కోత పడే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపినట్టు సమాచారం. దీంతో ఆ అవకాశం ఇవ్వకుండా చేపట్టాల్సిన చర్యలను వెంటనే అమల్లోకి తేవాలని మంత్రి అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

# భూముల రిజిస్ట్రేషన్ బాధ్యతలు తహసీల్దార్లకే

- **లాగిన్ సౌకర్యం నుంచి డిప్యూటీ తహసీల్దార్లు ఔట్**
- **రంగారెడ్డి కలెక్టర్ ఆదేశాలు!**
- **సాగు భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాల నేపథ్యంలో నిర్ణయం!**
- **రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానం అమలయ్యేనా?**

రంగారెడ్డి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): ఇక నుంచి వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ బాధ్యతలను పూర్తిగా తహసీల్దార్లే చేపట్టనున్నారు. ఇప్పటివరకు తహసీల్దార్‌తో పాటు, డిప్యూటీ తహసీల్దార్ ఇద్దరికీ ధరణి లాగిన్ సౌకర్యం ఉండగా.. ఇకపై ఒక్క తహసీల్దార్‌కే లాగిన్ సౌకర్యం ఉండనున్నది. రంగారెడ్డి కలెక్టర్ అంతర్గతంగా జారీ చేసిన ఆదేశాల మేరకు జిల్లాలోని తహసీల్దార్లు దీన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకుంటున్నట్టు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ తీసుకున్న ఈ నిర్ణయం సరికొత్త చర్చకు దారితీసింది.

### రిజిస్ట్రేషన్లలో పారదర్శకత కోసమే

ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ బాధ్యతలను తహసీల్దార్లే నిర్వర్తిస్తూ జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ ఇతర పనులపై తహసీల్దార్లు దృష్టిసారించడం లేదన్న కారణంతో గత ప్రభుత్వ హయాంలో డిప్యూటీ తహసీల్దార్లకు ధరణి పోర్టల్‌లో లాగిన్ సౌకర్యాన్ని కల్పించారు. తహసీల్దార్ సెలవుల్లో ఉన్న సందర్భంలోనే డిప్యూటీ తహసీల్దార్లు రిజిస్ట్రేషన్లు చేసేవారు. తహసీల్దార్లు ఇతర రెవెన్యూ పనుల్లో బిజీ కావడంతో కొంతకాలం తర్వాత రిజిస్ట్రేషన్లను పూర్తిగా డిప్యూటీ తహసీల్దార్లే చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని చోట్ల పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ధరణికి సంబంధించిన అనేక ఫిర్యాదుల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించినవే ఉంటున్నాయి. ఇక రంగారెడ్డి జిల్లాలోనూ ఈ తరహా ఫిర్యాదులు కోకొల్లలు. ఈ క్రమంలో డిప్యూటీ తహసీల్దార్లకు లాగిన్ సౌకర్యం తొలగించి రిజిస్ట్రేషన్ బాధ్యతలను పూర్తిగా తహసీల్దార్లకే అప్పగించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక తాజాగా నిర్ణయం తీసుకున్నారు. తహసీల్దార్లు సెలవుల్లో ఉన్నప్పుడు లేదా వివిధ రెవెన్యూ పనుల నిమిత్తం అందుబాటులో లేని సందర్భంలో కలెక్టర్ అనుమతితో లాగిన్‌ను డిప్యూటీ తహసీల్దార్లకు ఇవ్వాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. రిజిస్ట్రేషన్లలో పారదర్శకత కోసమే ఈ విధానానికి జిల్లాలో శ్రీకారం చుట్టినట్టు తెలుస్తున్నది.

### రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యేనా?

రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం అమలులో ఉన్న ఈ విధానం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా? అన్న చర్చ రెవెన్యూ వర్గాల్లో జరుగుతున్నది. ధరణి పోర్టల్, భూ సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తును ప్రారంభించింది. ధరణి కమిటీ భూ సమస్యల పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నది. కలెక్టర్ స్థాయిలో సమస్యల పరిష్కారానికి అధికారాలున్నప్పటికీ తహసీల్దార్ నుంచి విచారణ దస్త్రం రానిదే అడుగు పడటం లేదు. ఇటీవల ఐదు జిల్లాల కలెక్టర్లతో ధరణి కమిటీ నిర్వహించిన సమావేశంలో ఏం మార్పులు చేస్తే బాగుంటుందన్న కీలక చర్చ జరిగినట్టు తెలిసింది. డిప్యూటీ తహసీల్దార్లను రిజిస్ట్రేషన్ బాధ్యతల నుంచి తప్పించాలన్న అంశం కూడా ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్టు తెలిసింది. ఇదే క్రమంలో తహసీల్దార్లకే పూర్తి బాధ్యతలు అప్పగించి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్న ఆలోచన కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్టు సమాచారం.

## ఇంకా సిద్ధంకాని ధరణి నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునర్నిర్మాణ కమిటీ ఇప్పటివరకు నివేదికను సిద్ధం చేయలేదు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ధరణి పోర్టల్‌పై మధ్యంతర నివేదికను ప్రవేశపెట్టి చర్చ జరుపాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అందులో పేర్కొన్న లోపాలను హైలెట్ చేస్తూ లోక్‌సభ ఎన్నికల్లో అస్త్రంగా వాడుకోవాలని భావించింది. తద్వారా బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టొచ్చని యోచించింది. అయితే, ధరణి పునర్నిర్మాణ కమిటీ ఇప్పటివరకు నివేదిక సిద్ధం చేయలేదు. దీంతో రెవెన్యూ శాఖ అధికారులపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. కమిటీ నివేదిక ఇచ్చేదెప్పుడు? ప్రభుత్వం రివ్యూ చేసేదెప్పుడు? దాన్ని ప్రజల ముందు పెట్టేదెప్పుడు? అని నిలదీసినట్టు తెలిసింది. మరోవైపు.. వివిధ శాఖల అధికారులతో ధరణి కమిటీ ఇటీవలే సమావేశాలు పూర్తిచేసింది.

## బీసీ కమిషన్ ఎక్స్ ఆఫీషియో మెంబర్‌గా బాలమాయ దేవి

హైదరాబాద్, ఫిబ్రవరి9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఎక్స్‌ఆఫీషియో మెంబర్‌గా బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాల మాయ దేవి నియమితులయ్యారు. ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## తిరుమల బ్రేక్‌దర్శనం భక్తులకు ఎస్ఎంఎస్ పే సిస్టమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి దర్శనానికి బ్రేక్‌దర్శనం టికెట్లు పొందే భక్తుల సౌకర్యార్థం టీటీడీ నూతనంగా ఎస్ఎంఎస్ పే సిస్టమ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంలో ఎస్ఎంఎస్ ద్వారా పే లింక్‌ను పంపుతారు. భక్తులు ఆ లింక్ పైన క్లిక్ చేసి యూపీఐ లేదా క్రెడిట్ కార్డు లేదా డెబిట్ కార్డు ద్వారా సొమ్ము చెల్లించి టికెట్లను ప్రింట్ తీసుకోవచ్చు.

## జీఆర్ఎంబీ సమావేశం 27కు వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 9: గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశం ఈ నెల 27కు వాయిదా వేసినట్టు బోర్డు చైర్మన్ తెలియజేశారు.



హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జగిత్యాల బీజేపీ నేతలు

# ఎంపీ అర్వింద్‌కు మళ్లీ టికెట్ ఇవ్వొద్దు

- **హైదరాబాద్ ఆఫీసులో బీజేపీ శ్రేణుల ఆందోళన**

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 9: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు టికెట్ ఇవ్వొద్దని హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట శుక్రవారం ఆ పార్టీకి చెందిన జగిత్యాల నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఓ దశలో ఆ పార్టీ కార్యకర్త ఒకరు పెట్రోల్ పోసుకొని తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశాడు. కార్యాలయం ఎదుట బైఠాయించిన శ్రేణులు.. పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రావాలి, అర్వింద్ డౌన్‌డౌన్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎంపీగా గెలిచిన అనంతరం అర్వింద్ పార్టీ కార్యకర్తలకు తీవ్రం అన్యాయం చేస్తున్నారని జగిత్యాల నాయకులు ధ్వజమెత్తారు. అర్వింద్‌కు టిక్కెట్ ఇస్తే ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. బీజేపీ కార్యకర్త సతీశ్ పెట్రోల్ పోసుకోవడంతో అక్కడున్న వారు అతనిపై నీళ్లు చల్లి వారించారు.

## నాయీ బ్రాహ్మణ, రజక ఫెడరేషన్లకు 21 లక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ నాయీ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ, రజక కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్లకు కలిపి రూ.21లక్షల నిధులను విడుదల చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాయీ బ్రాహ్మణ సొసైటీలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలకు రూ.7 లక్షలు, రజక సొసైటీలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలకు రూ.14 లక్షలను ప్రభుత్వం గత బడ్జెట్‌లో పొందుపరిచిన విషయం తెలిసిందే.

## ఏసీబీ వలలో రాజీవ్ స్వగృహ ఏజీఎం

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి9: తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మహ్మద్ మసూద్ అలీ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. డ్రాయింగ్ సెక్షన్ పనులకు బిల్లులు చేసేందుకు బాబూరావు అనే కాంట్రాక్టర్ నుంచి అలీ రూ.13 వేలు లంచం అడిగాడు. దీంతో ఆయన ఏసీబీని ఆశ్రయించారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని రాజీవ్ స్వగృహ కార్యాలయంలో బాబూరావు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

# బీఆర్ఎస్ పార్టీకి రుణపడి ఉంటాం

- **16న ఆటో బంద్: వేముల మారయ్య**



హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): ఆటో డ్రైవర్లకు అండగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీకి రుణపడి ఉంటామని టీఏటీయూ ఆటో యూనియన్ రాష్ట్ర నాయకుడు వేముల మారయ్య తెలిపారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో ఆటోడ్రైవర్ల సమస్యలపై గొంతెత్తిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కృషిని మరువబోమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 16న జరిగే ఆటో బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఆటోడ్రైవర్లు ఎంతో ధైర్యంగా ఉన్నారని, ఇప్పుడు జీవనం కోల్పోయి రోడ్డునపడ్డారని తెలిపారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పోలె నిరంజన్, సెక్రెటరీ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే నెల 23, 24న ఎంఆర్‌యూసెట్

మేడ్చల్, ఫిబ్రవరి 9: పేద, మధ్యతరగతి విద్యార్థులకు రూ.5 కోట్ల విలువైన ఉపకార వేతనాలను వచ్చేవిద్యాసంవత్సరంలో అందించనున్నట్టు మల్లారెడ్డి వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ వీఎస్‌కే రెడ్డి తెలిపారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని వర్సిటీలో మల్లారెడ్డి విశ్వ విద్యాలయం ప్రవేశ పరీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించిన మాట్లాడుతూ.. ఎంఆర్‌యూ సెట్ వచ్చే నెల 23, 24న ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. అన్ని రాష్ట్ర బోర్డులు, సెంట్రల్ బోర్డు, ఇతర గుర్తింపు పొందిన సంస్థల విద్యార్థులు మార్చి 22లోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.





కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ వీఎస్‌కే రెడ్డి



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న నిమ్స్ వైద్యురాలు స్వర్ణలత

## తెలంగాణ జీవన్‌దాన్‌కు మరో అవార్డు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): అవయవ మార్పిడితో వందలాది మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న తెలంగాణ జీవన్‌దాన్‌కు మరో అవార్డు వరించింది. అవయవ సేకరణ, మార్పిడి ప్రక్రియలో ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు ఈ అవార్డు దక్కింది. ఢిల్లీలో జరిగిన ఆరోగ్య సదస్సులో కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చేతుల మీదుగా నిమ్స్ దవాఖాన నెఫ్రాలజీ విభాగం ప్రొఫెసర్, జీవన్‌దాన్ ఇన్‌చార్జ్ డాక్టర్ స్వర్ణలత '1వ టెలివిజన్ ఆరోగ్య సుశ్రుత-2024' అవార్డు అందుకొన్నారు. ఈ మేరకు డాక్టర్ స్వర్ణలతను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్ అభినందించారు.

